# శివకుమారిగుండు

ప్రతాప రవిశంకర్



**హోరున వర్షం కురుస్తోంది**

విసురుగా కొట్టిన గాలికి దగ్గరకు మూసి వున్న గది తలుపులు తెరచుకున్నాయి. గాలితో పాటు జల్లుకూడా లోపలకువచ్చి పడింది కుర్చీలో కూర్చుని సిగరెట్టు కాలుస్తూ నవల చదువుతున్న వాడినల్లా లేచి తలుపులు మూసి గడియ పెట్టాను కళ్ళు మిరుమిట్లు గొలిపేట్టు మెరుపులు మెరుస్తున్నాయి పగలే దట్టమైన చీకట్లు అలముకున్నాయి

చివరంటా కాలిన సిగరెట్టును కిటికీలోనించి బయటకు విసిరి టేబుల్‌మీది సిగరెట్‌పాక్‌ను అందుకొని మరో సిగరెట్ వెలిగించి గుండెలనిండా పొగ పీల్చాను హాయిగా వున్నట్లనిపించింది

ఆదివారం నా రూమ్మేటు తన స్వగ్రామం వెళ్లిపోయాడు గదిలో నేనొక్కడినే వుండవలసి వచ్చింది. అతనుంటే ఇద్దరం పేకాడుకుంటూ సాయంత్రం వరకూ గడిపేవాళ్ళం ఒంటరివాడిని కావటంతో బోర్ కొడుతున్నా విరామం లేకుండా వర్షం పడటంతో బయటకు కదల్లేకపోయాను ఏదైనా చదువుతూ పొర్చుందామని ఓ నవల తీసుకొని చదువుతున్నా పేజీలు బారంగా కదులుతున్నాయి

అటువంటి సమయంలో, అంత వర్షంలోనూ గొడుగు వేసుకుని సగం తడిసి గబగబా నా గదికి వచ్చాడు షణ్ముఖమూర్తి అతని రాకను కిటికీలోనించే గమనించిన నేను వెళ్లి గది తలుపులు తెరిచాను లోపలకు వచ్చాడతను. షణ్ముఖమూర్తి నా స్నేహితుడు. మా ఆఫీసులోనే పని చేస్తున్నాడు మంచి మనిషి. ఇంకా పెళ్లికాలేదు నాకంటే నాలుగైదేళ్ళ చిన్నవాడనుకుంటాను నన్ను మాస్టారూ అని పిలుస్తాడు

“ఏమిటోయ్ . ఇంత వర్షంలో వచ్చావ్” అన్నాను నవ్వుతూ .

“నా రూమ్మేటూ వూరికి వెళ్లాడండీ ఒక్కడినే కూర్చోలేకపోయాను బోర్ కొట్టింది మాస్టారూ... మీరూ ఒంటరిగానే వుంటారని తెలుసు ఇద్దరికీ కాలక్షేపం అవుతుంది కదాని వచ్చాను” అన్నాడతను

టవలుతో తడిసిన శరీరాన్ని తుడుచుకొని నా ఎదురుగా వున్న మరో కుర్చీలో కూర్చుని సిగరెట్ వెలిగించాడు షణ్ముఖమూర్తి.

“ఏమిటోయ్ ... విశేషాలు” అడిగాను కుర్చీలో వెనక్కివాలి ఒళ్ళు విరుచుకుంటూ .

“ఏమున్నాయ్ మాస్టారూ మీరే చెప్పాలి” అన్నాడు పొగను బయటకు వదులుతూ .

“సుకుమార్రావు — సుగుణవతి పెళ్లి చేసుకోబోతున్నారుట తెలుసా ?” అడిగాను.

“నిజమా?” ఆశ్చర్యంగా పొగ పీల్చబోయే వాడల్లా ఆగి అడిగాడతను

“నిజమో, కాదో నాకు తెలియదు నిన్న ఉదయం మా రూమ్మేటు చెప్పాడు”

“చంపేశారు ... నిన్న ఉదయమా .. అయితే ఈ రోజు ఉదయం నాకు అందిన తాజావార్త చెబుతావినండి” అన్నాడతను.

“ఏమిటి ?” కుతూహలంగా ముందుకు వంగుతూ అన్నాను ఎందుకంటే సాధారణంగా షణ్ముఖమూర్తి సేకరించేవన్నీ తాజా వార్తలే

సుకుమార్రావు మా ఆఫీసులో గుమాస్తా ఆ సుగుణవతి సుకుమార్రావు ప్రియురాలు వారిద్దరి మధ్య గత నాలుగు నెలలుగా ప్రణయం సాగుతోంది ఈ విషయం మా ఆఫీసు ప్యూను పరశురాం దగ్గర్నించి ఆఫీసరు ఆదిశేషయ్య వరకూ తెలుసు సుకుమార్రావు పక్కనే సుగుణవతిని నేనూ రెండు మూడు సార్లు చూశాను ఆ అమ్మాయి బి కాం ఫస్టియర్ చదువుతోందిట

షణ్ముఖమూర్తి మొదలు పెట్టాడు

“నిన్న సాయంత్రం సుకుమార్రావు మరికొంతమంది మన ఆఫీసు క్లర్కులు నాజ్ సెంటర్లో నిల్చుని కబుర్లు చెప్పుకుంటున్నారుట. ఇంతలో ఓ రిక్షాలో సుగుణవతి, వాళ్లమ్మ, మరో ఆమె అటుగా వచ్చారుట వాళ్లమ్మ, మరో ఆమె సీటు మీద కూర్చున్నారుట. సుగుణవతి సీటు ముందు వాళ్ల కాళ్లదగ్గర బాసింపట్టు వేసుకొని భోజనానిక్కూర్చున్నట్టు కూర్చుందిట. ఆ దృశ్యంచూసి మన క్లర్కులందరూ విరగబడి నవ్వారుట. “అదేమిటోయ్ సుకుమార్రావ్ .. ఆ అమ్మాయి మరో రిక్షాలో కూర్చోవచ్చుగదా” అన్నారుట హేళనగా ఆ మాటలతో సుకుమార్రావుకి తన ప్రియురాలు మీద కోపం వచ్చిందట చుర్రున అక్కడినించి వెళ్లిపోయాడట. ఆ

రా (త్రి సుగుణవతిని కలుసుకొని నీకూ నాకూ చెల్లని చెప్పివచ్చాడుట అతని స్నేహితుడు ఒకతను ఉదయమే నాకు చెప్పాడు ఈ విషయం'' చెప్పాడు షణ్ముఖమూర్తి నవ్వుతూ

నేనూ నవ్వకుండా ఉండలేకపోయాను ''మొత్తానికి (ప్రేమికులిద్దరూ విడిపోయా రన్నమాట'' అన్నాను తలవూపాడతను.

వర్షం మరీ పెద్దదయింది కిటికీలో నించికూడా జల్లు లోపలికి రావడంతో తలుపులను మూసివేశాను. చలిచలిగా వుంది.

''ఇలాంటి సమయంలో వేడి వేడి టీ వుంటే బావుంటుంది మాష్టారూ''అన్నాడు షణ్ముఖమూర్తి.

''నిజమేనోయ్. మరచిపోయాను. పాలు కూడా వున్నాయి. కూర్చో... ఐదు నిమిషాల్లో మన చేతుల్లో పొగలు కక్కే టీ వుంటుంది'' అంటూ లేచి స్టౌ దగ్గరకు వెళ్ళాను.

నిమిషంలో స్టౌ వెలిగించి నీళ్ళు పెట్టాను.

''సుకుమా(రావు—సుగుణవతితో ఆ కాజ్ మీద తెగతెంపులు చేసుకోడం చాలా సిల్లీగా వుంది కదు మాస్టారూ'' అన్నాడు షణ్ముఖమూర్తి నీలిరంగులోవున్న స్టౌ మంటను చూస్తూ.

''సిల్లీ ఏముందోయ్... ఇంతకంటే సిల్లీ కాజ్‌ల మూలంగా విడిపోయిన (ప్రేమికుల కేసులు కూడా వున్నాయి. నాకు ఓ సంఘటన గుర్తొస్తోంది. చెబుతాను విను. ''నేను కాలేజీలో డి(గ్రీ చదివేరోజుల్లో నాకు ఆంజనేయ కుమార్ అనే ఓ మి(త్రుడు వుండేవాడు. అతనికి అమ్మాయిలంటే తగనిమోజు. మనిషి మంచివాడే. చదువులో చాకులా ఉండేవాడు. చాలా మందికి లైన్సు వేశాడు. చివరికి ఓ అమ్మాయి లైన్లో పడింది. ఆఅమ్మాయి పేరు శివకుమారి. వ్యవహారాన్ని చాలాదూరం తీసుకెళ్ళాడు. శివకుమారి అంత అందగత్తె కాదు. ఆంజనేయకుమార్ మీద కొంచెం నయం. మొత్తానికి ఇద్దరూ సరదాగా తిరిగారు. ఇతను సైకిలేసుకొని ఆ అమ్మాయి ఇంటిముందుకెళ్ళి బెల్ కొడితే చాలు శివకుమారి పరిగెత్తుకుంటూ వచ్చేది. ఓ రోజు తన (ప్రేమ వ్యవహారాన్ని మి(త్రులందరికీ చెప్పి తను ఆ అమ్మాయిని సెలవుల్లో పెళ్ళి చేసుకోబోతున్నట్టుకూడా చెప్పాడు. ఇంకేముంది? మి(త్రులందరూ శివకుమారిని చూపమని బలవంత పెట్టారు. సరే. మి(త్రుల కోరిక తీర్చటానికి వారందర్నీ వెంటేసుకొని శివకుమారి ఇంటి ముందుకు వెళ్ళాడు గేటు వేసివుంది సైకిలు బెల్లు మోగించాడు నిమిషం తర్వాత గేటు తెరుచుకుంది మి(త్రులందరూ ఒళ్ళంతా కళ్ళు చేసుకొని చూశారు గుండు చేయించుకున్న ఓ పదిహేడేళ్ళ అమ్మాయి బయటకు వచ్చింది మొదట్లో ఆ అమ్మాయిని ఆంజనేయకుమార్ గుర్తించలేదు తర్వాత గుర్తించాడు ఇంతలో అతని మి(త్రుల్లో శివకుమారిని ఎరిగిన ఒకతను ''ఈ అమ్మాయే శివకుమారి'' అన్నాడు వెంటనే అందరూ ఘొల్లున నవ్వారు శివకుమారి పరిస్థితి (గ్రహించి లోపలకు వెళ్ళిపోయింది. రెం(డ్రోజుల (క్రితం రామందరూ తిరుపతి వెడుతున్నట్లు శివకుమారి చెప్పిన విషయం ఆంజనేయకుమార్‌కు గుర్తులేదు మి(త్రులందరి నవ్వులమధ్య అతను అవమానభారంతో (క్రుంగిపోయాడు అంతే ఆ తర్వాత అతను మళ్ళీ శివకుమారిని కలుసుకోలేదు ఎరి ఈ కాజ్ మటుకు సిల్లీగా లేదూ'' అన్నాను షణ్ముఖమూర్తి చేతికి పొగలు కక్కుతున్న టీ కప్పును అందిస్తూ

''నిజమే మాస్టారూ'' అన్నాడతను కప్పును అందుకుంటూ కాని—అతనికి చెప్పిన సంఘటన నా జీవితంలో జరిగిందేననీ, ఆ ఆంజనేయ కుమార్‌ని నేనేనని షణ్ముఖమూర్తికి చెప్పలేకపోయాను

